# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక :364 | 11-07- 2026 | శనివారం | పేజీలు: 4 | వెల రూ. 03



తెలంగాణ వెన్నెల వాక్కు **విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో


# అధికారుల నిద్రమత్తుకు నిదర్శనం..

## అటెండరే సారు.. అంతర్గాం బడి తీరు!

- ఇద్దరు ఉపాధ్యాయులు ఒకేసారి సెలవుపై వెళ్లడంతో స్తంభించిన విద్యా బోధన
- ప్రభుత్వ పాఠశాల దుస్థితిపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థుల తీవ్ర ఆగ్రహం




నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా పరిధిలోని అంతర్గాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితి జిల్లా విద్యాశాఖ అధికారుల చేతకానితనానికి, మొండి నిద్రకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామంటూ ఉన్నతాధికారులు కాగితాల్లో గొప్పలు చెప్పుకోవడం తప్ప, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దారుణాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పాఠశాలలో విధుల్లో ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు కనీస బాధ్యత లేకుండా ఒకే రోజు, ఒకేసారి సెలవుపై వెళ్ళిపోతే, కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయలేకపోయిన మండల విద్యాశాఖ అధికారుల పనితీరు వారి వైఫల్యాన్ని వేలెత్తి చూపుతోంది. ఒక రోజంతా బడిలో ఉపాధ్యాయులే లేరనే కనీస సమాచారం కూడా అధికారులకు తెలియకపోవడం వారి అప్రమత్తత ఎంత అధ్వానంగా ఉందో స్పష్టం చేస్తోంది.

**అటెండర్ చేతిలో విద్యార్థుల భవిష్యత్తు:**

ఉపాధ్యాయులు లేని బడిని పూర్తిగా అటెండర్ చేతికి అప్పగించడం పేద విద్యార్థుల భవిష్యత్తు పట్ల విద్యాశాఖకు ఉన్న నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారింది. క్షేత్రస్థాయిలో పాఠశాలల దుస్థితిని కళ్లార చూసి సరిదిద్దకుండా, కేవలం అంతా బాగుందంటూ తప్పుడు నివేదికలతో కాలం వెళ్లదీస్తున్నారనే విమర్శలకు ఈ ఘటనే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. బడికి వచ్చిన వందలాది మంది పేద విద్యార్థులకు ఏం చేయాలో, ఎటు వెళ్లాలో పాలుపోని స్థితి ఏర్పడటంతో అటెండర్ తరగతి గదిలో కూర్చొని పిల్లలను అదుపు చేయాల్సి వచ్చింది. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఒక ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్తే, మరొకరు పాఠశాల నిర్వహణను చూసుకోవాలి. ఇద్దరూ వెళ్లాల్సి వస్తే ప్రత్యామ్నాయంగా వేరే పాఠశాల నుండి ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాలి. కానీ, ఇక్కడ అవేమీ పట్టించుకోకుండా బడిని పూర్తిగా గాలికి వదిలేశారు. అధికారుల లోపం వల్లే తమ పిల్లల చదువులు నాశనమవుతున్నాయని స్థానిక గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి, అంతర్గాం బడిని గాలికి వదిలేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## వ్యక్తిగతంగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

### -సొసైటీలతో సంబంధం లేకుండా ఇచ్చేందుకు కృషి

జర్నలిస్టుల్లో చాలామంది పేదలు, మధ్యతరగతి వారే
ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి ,
సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ – హెచ్ – 2843) ఖమ్మం జిల్లా కమిటీ గురువారం చింతకాని మండలం లచ్చగూడెంలో సమర్పించిన వినతిపత్రం పై డిప్యూటీ సీఎం స్పందించారు. మండలంలోని జగన్నాథపురంలో శుక్రవారం జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి హాజరవుతున్న దృష్ట్యా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకు వెళ్లాల్సిందిగా టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. దీనిపై స్పందించిన భట్టి... సొసైటీల ద్వారా

2

# రైతుల కళ్లల్లో ఆనందమే ప్రజా ప్రభుత్వానికి ఆశీర్వాదం:

- వ్యవసాయాన్ని పండుగ చేయడమే లక్ష్యం.. 30 నెలల్లో వ్యవసాయ రంగానికి 1.70 లక్షల కోట్లు
- 9 రోజుల్లోనే 73.30 లక్షల మంది రైతులకు రూ.9,000 కోట్ల రైతు భరోసా జమ
- ఖమ్మం జిల్లా జగన్నాథపురం రైతు ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంఖారావం

ఖమ్మం/జగన్నాథపురం, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు ప్రతినిధి):
రాష్ట్రంలోని అన్నదాతల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందమే తమ ప్రజా ప్రభుత్వానికి అసలైన ఆశీర్వాదమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని దండగ కాదు.. పండుగ చేయడమే ఏకైక లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని అశేషంగా తరలివచ్చిన రైతాంగాన్ని ఉద్దేశించి ప్రకటించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో నిర్వహించిన భారీ 'రైతు ఆశీర్వాద సభ' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. గడిచిన 9 రోజుల్లో రికార్డు స్థాయిలో 9,000 కోట్ల రూపాయల నిధులను 73.30 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసిన సందర్భంగా ఈ సభ నిర్వహించారు. సభా వేదికగా రైతు భరోసా చివరి విడత కింద 1.44 లక్షల మంది రైతులకు 1009.15 కోట్ల రూపాయల నిధులను విడుదల చేయడంతో పాటు, డిజిటల్ విప్లవంలో భాగంగా రైతులకు నూతన 'ఈ-పట్టాదారు పాసుపుస్తకాలను' జారీ చేసే చారిత్రాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి లాంఛనంగా శ్రీకారం చుట్టారు.



**30 నెలల్లో 1.70 లక్షల కోట్ల రైతు సంక్షేమం:**

అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతులను రాజులను చేయాలన్న ఆలోచనతోనే గడిచిన 30 నెలల కాలంలో 1 లక్ష 70 వేల కోట్ల రూపాయల భారీ నిధులను కేవలం వ్యవసాయ రంగంపైనే ఖర్చు చేశామని వివరించారు. సగటున ప్రతి నెల 5,500 కోట్ల రూపాయలు రైతుల కోసం వెచ్చిస్తున్నామన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదని పెద్దలు చెప్పారని, అందుకే గత ప్రభుత్వంలో ఉన్న 8.11 లక్షల కోట్ల రూపాయల అప్పుల భారాన్ని మోస్తూనే, ఎంతో సమయస్ఫూర్తితో రాష్ట్రాన్ని నడిపిస్తూ అదనపు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద ఎకరాకు 12,000 రూపాయలకు పెంచి అందిస్తున్నామని, 30 నెలల్లో 80 వేల కోట్ల రూపాయల వడ్లను కొనుగోలు చేశామన్నారు. అలాగే రాష్ట్రంలోని మొక్కజొన్న రైతుల కోసం 3,504 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు ప్రకటించారు.

**నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు.. ఏడాదిలో 67,717 ఉద్యోగాల భర్తీ:**

గత ప్రభుత్వంలో ప్రజలకు ఉపయోగపడే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను కొనసాగిస్తూనే, అర్హులైన ప్రతి పేదవారికి కొత్త రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, 7 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. మహిళా సంఘాలకు 1,000 బస్సులు అందించడంతో పాటు బ్యాంకుల లింకేజీతో 60 వేల కోట్ల రూపాయల రుణాలు అందించామన్నారు. నిరుద్యోగుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 67,717 ప్రభుత్వ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశామని వివరించారు.

**2029 నాటికి 182కు పెరగనున్న అసెంబ్లీ స్థానాలు:**

వచ్చే 2029 మే, జూన్ నెలల్లో జరిగే శాసనసభ ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరిగి రాష్ట్రంలో లోక్‌సభ

2

## సర్' ప్రక్రియ పూర్తయ్యాక రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు'




హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ వ్యాప్తంగా 'సర్' ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి (జజూా) సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 98 శాతం ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ జరిగిందని.. ఈనెల 24వ తేదీ వరకు పత్రాల డిజిటల్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్స్ రాకపోతే ఆగష్టులో ఫామ్ 6, 8 ఇస్తారని.. నింపి ఇవ్వాలన్నారు.

'సర్' ప్రక్రియ ముగిసిన తర్వాత కొత్త ఓటర్ నమోదు కార్యక్రమం ఉంటుంది. కొత్త ఓటర్ నమోదు చేసుకుంటే నెల రోజుల్లో ఈసీఐ ఇస్తుంది. ఓటు ఉండి.. ఎన్యూమరేషన్ ఫామ్ రాకపోతే బీఎల్‌వోను సంప్రదించాలి. తెలంగాణలో తప్పుడు వివరాలు ఉన్న ఓటర్లు అనామాలీస్ 89 లక్షలు ఈసీఐ గుర్తించింది. త్వరలో అక్షర దోషాలు ఉన్న అనామాలీస్ ఓటర్లకు ఎలక్షన్ కమిషన్ నోటీసులు ఇస్తుంది" అని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

రైట్ టు ఇన్ఫర్మేషన్ అనేది ప్రతీ ఒక్కరికీ ముఖ్యమైనది. ఓటర్ సవరణ నిరంతరం జరిగే ప్రక్రియ. ఎన్నికలకు ముందు జరిగే స్పెషల్ సమ్మరి రివిజన్ జరిగేది. ఇప్పుడు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుంది. ఓటర్ ప్రక్షాళన చేయాలని ఈసీఐ నిర్ణయం తీసుకుంది. 'సర్ ప్రక్రియ రెండు భాగాలుగా జరుగుతుంది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాక రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు శిక్ష పడుతుంది. డీఎస్ఏ సాఫ్ట్‌వేర్ ద్వారా దేశ వ్యాప్తంగా రెండు ఓట్లపై ప్రక్షాళన చేస్తారు. 2002 డేటా లేకపోతే ఆ ఓటర్లకు నోటీసులు ఇచ్చి ప్రత్యేక సర్వే జరుగుతుంది. ఏజెన్సీ ఏరియాల్లో 59 శాతం ఫామ్స్ నింపి తిరిగి ఇచ్చారు. ఓల్డ్ సిటీలోని 7 నియోజకవర్గంలో ఫామ్స్ అందాయి. డిజిటలైజేషన్ జరుగుతుంది. ఓటు లేకపోతే సంక్షేమ పథకాలు ఇస్తారా? లేదా? ప్రభుత్వం నిర్ణయం" అని సుదర్శన్‌రెడ్డి చెప్పారు.

# కాలవర్షాల అనిశ్చితి -- సంక్షోభంలో దేశీయ వ్యవసాయ రంగం

ఒక విచిత్రమైన, అత్యంత ఆందోళనకరమైన సామాజిక, భౌగోళిక వైరుధ్యం కనిపిస్తోంది. ఒకవైపు దేశంలోని ప్రధాన నగరాలు భారీ వర్షాలు, వరదలతో మునిగిపోతుంటే, మరోవైపు దేశానికి అన్నం పెట్టే గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాలు మాత్రం సమయానికి తగినంత వర్షపాతం లేక వెలవెలబోతున్నాయి. జూన్ నెలలో తొలకరి వర్షాలు ఆశించిన స్థాయిలో పుంజుకోకపోవడంతో దేశవ్యాప్తంగా వర్షాకాలపు పంటల సాగు కాలం తీవ్ర అగమ్యగోచరంగా ప్రారంభమైంది. ఇప్పుడు అందరి దృష్టి జూలై నెల కురిపించే వర్షాలపైనే నిలిచింది. ఈ జూలై వర్షాలు దేశ వ్యవసాయ రంగాన్ని గట్టెక్కిస్తాయా, లేదా అన్నది పెద్ద చిక్కుముడిగా మారింది. ఆలస్యంగా, అస్థిరంగా కురుస్తున్న పవనాల వల్ల వరి నాట్లు గణనీయంగా నెమ్మదించడమే కాకుండా, ప్రధాన ఆహార పంటల సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. ఇది అంతిమంగా దేశంలో ఆహార పదార్థాల వెలల పెరుగుదలను హెచ్చించి, సామాన్యుడిపై మోయలేని భారాన్ని మోపుతుందనే భయాలను మళ్లీ సజీవం చేస్తోంది.

**సాగు విస్తీర్ణంపై అస్థిర వర్షాల దుష్పరిణామం**

కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు దేశ వ్యవసాయ స్థితికి అద్దం పడుతున్నాయి. జూలై ఐదో తేదీ నాటికి నమోదైన వర్షాకాలపు పంటల సాగు విస్తీర్ణం, గత ఏడాదితో పోల్చి చూస్తే ఏకంగా తొంబై ఒక్క లక్షల తొంబై ఐదు వేల హెక్టార్లు తక్కువగా ఉంది. దేశంలో ప్రధాన ఆహారమైన వరి సాగు విస్తీర్ణం తొమ్మిది శాతానికి పైగా మేర పడిపోయింది. అయితే ఈ ప్రతికూల మార్పు కేవలం వరి పంటకే పరిమితం కాలేదు, ఇతర వాణిజ్య, పప్పుధాన్యాల పంటలపైనా దీని తాకిడి తీవ్రంగా ఉంది.

పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పది లక్షల హెక్టార్లకు పైగా తగ్గగా, తృణధాన్యాలు పదకొండు లక్షల హెక్టార్ల మేర తగ్గాయి. అత్యంత ఘోరంగా నూనెగింజల సాగు విస్తీర్ణం ఏకంగా నలభై రెండు లక్షల హెక్టార్లకు పైగా పడిపోవడం గమనార్హం. అటు పత్తి సాగు కూడా పద్దెనిమిది లక్షల హెక్టార్ల పైగా తగ్గింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే, అస్థిరమైన వర్షాలు దేశంలోని మొత్తం పంట చక్రాన్నే తలకిందులు చేశాయని స్పష్టమవుతోంది.

**పంటల కాలపట్టిక -- రైతాంగ సవాళ్లు**

వ్యవసాయంలో ఇబ్బంది కేవలం వం- ్షం ఎంత పడింది అనే కొలతపైనే ఆధారపడి ఉండదు. ముఖ్యంగా వరి సాగు విధానం ఇతర పంటల కంటే భిన్నమైన కాలపట్టికను అనుసరిస్తుంది. వరి సాగు చేయాలంటే మొదట నారుమడులను పెంచాలి, ఆ తర్వాతే తగినంత తేమ, నీటి వసతి ఉన్న ప్రధాన పొలాల్లో నాట్లు వేయాలి. కొన్ని వారాల పాటు క్రమపద్ధతిలో కురిసే తేలికపాటి జల్లులు వ్యవసాయానికి ఎంతో మేలు చేస్తాయి. కానీ ప్రస్తుత వాతావరణంలో అటువంటి క్రమబద్ధత లోపించింది. ఒక్కసారిగా కురిసే భారీ వర్షాలు లేదా అకస్మాత్తుగా ముంచెత్తే వరదలు నిరంతరాయంగా కురిసే జల్లులకు ఈడు కావు. రైతులకు కావలసింది ఆకాశం విరిగిపడే భారీ వర్షాలు కాదు, కాలం అంతటా సమానంగా విస్తరించే హేతుబద్ధమైన వర్షపాతం. సాధారణంగా వర్షాకాలపు విత్తనాలు నాటే ప్రక్రియ జూలై ఆఖరి నాటికి చాలా వరకు పూర్తవుతుంది కాబట్టి, రైతులు ఈ నష్టాన్ని భర్తీ చేసుకుని కోలుకోవడానికి సమయం చాలా తక్కువగా ఉంది.

**ప్రభుత్వ ముందస్తు చర్యలు -- క్షేత్రస్థాయి వాస్తవాలు**

ఈ వాతావరణ సంక్షోభాన్ని ముందే ఊహించిన కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నెలలోనే అత్యవసర ప్రణాళికలను సిద్ధం చేయడం కొంత ఊరటనిచ్చే అంశం.

దాదాపు ఒక లక్షా ఇరవై నాలుగు వేల 'పొలాన్ని రక్షించుకునే' అవగాహన కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా ఎనభై లక్షల మంది రైతులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల కోసం ఒక లక్షా డెబ్బై ఐదు వేల క్వింటాళ్ల విత్తన నిల్వలను అందుబాటులో ఉంచడం, రైతు రుణ నిధి అనుమతులను వేగవంతం చేయడం మరియు వాతావరణం అనుకూలించని చోట తక్కువ కాలపరిమితి కలిగిన ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, సజ్జలు, పెసర్లు వంటి వాటిని ప్రోత్సహించడం వంటి ముందస్తు చర్యలు చేపట్టారు.

అధికారిక లెక్కల ప్రకారం, జూన్ నెలలో నలభై శాతంగా ఉన్న వర్షపాత లోటు జూలై నాటికి పదిహేను శాతానికి తగ్గింది. అలాగే వర్షపాత లోటుతో కొట్టుమిట్టాడుతున్న జిల్లాల సంఖ్య కూడా రెండు వందల అరవై రెండు నుండి ఒక వంద డెబ్బై ఎనిబిదికి పడిపోయింది. ఇవన్నీ కాగితంపై ఆశాజనకంగా



కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రధాన జలాశయాల నీటి మట్టాలు ఇంకా సాధారణ నిల్వ సామర్థ్యం కంటే తక్కువగానే ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం కానీ, రైతాంగం కానీ ఏమాత్రం అజాగ్రత్తగా ఉండటానికి వీల్లేదు. అంతర్జాతీయంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల మార్పుల దుష్పరిణామం రుతుపవనాలను మరింత బలహీనపరిచే అవకాశం ఉంది, ఇది ఆహార పదార్థాల వెలల పెరుగుదలకు దారితీస్తుంది. ఒకవేళ జూలై మధ్య నాటికి కూడా విత్తనాలు నాటడం మరియు నాట్ల ప్రక్రియ పూర్తికాకపోతే, దీని దుష్ప్రభావం రాబోయే శీతాకాలపు పంటల కాలంపై కూడా పడే ప్రమాదం ఉంది. మన దేశంలో ఉన్న రికార్డు స్థాయి వరి నిల్వలు తక్షణ అన్నపానాల కొరతను నివారించవచ్చు కానీ, అవి పప్పుధాన్యాలు, వంట నూనెల అంగడి వెలలను అదుపు చేయలేవు. అటు రైతుల ఆదాయ నష్టాన్ని కూడా అవి భర్తీ చేయలేవు. కాబట్టి, ఈనాటి ఈ వ్యవసాయ ఎదురుటబ్బ రేపు దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద సవాలుగా మారకముందే, కోల్పోయిన సమయాన్ని మరియు పంట సామర్థ్యాన్ని తిరిగి పుంజుకోవడానికి జూలై నెల మాత్రమే భారతదేశానికి ఉన్న ఏకైక మరియు చివరి అవకాశం. ప్రభుత్వం మరింత పకడ్బందీగా చిన్న, సన్నకారు రైతులకు అండగా నిలవాల్సిన సమయం ఇది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# వ్యక్తిగతంగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

అయితే న్యాయపరమైన చిక్కులు ఉంటాయి కాబట్టి, అవేవీ లేకుండా వ్యక్తిగతంగానో...బీపీఎల్ కోటాలోనో...మరో రకంగానో ఇచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల్లో చాలామంది పేదలు, మధ్యతరగతి వర్గానికి చెందినవారు, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, అద్దె ఇండ్లలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో టీడబ్ల్యూజేఎఫ్ పేర్కొంది. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయమై అనేక పర్యాయాలు గత, ప్రస్తుత ప్రభుత్వంలో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో విజ్ఞప్తులు, పోరాటాలు నిర్వహించామని ఫెడరేషన్ నేతలు తెలిపారు.

ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం వెలుగుమట్ల, వీవీ పాలెం రెవెన్యూలో 23 ఎకరాలకు పైగా కేటాయిస్తూ జీవో ఇచ్చిందని, కానీ అది కార్యరూపం దాల్చలేదని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దీనిపై కొంత సందిగ్ధత ఏర్పడిందని న్యాయపరమైన చిక్కులు లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేసే విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ప్రకటనలు చేసి ఉన్నారని ప్రస్తావించారు. సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు వ్యక్తిగతంగా ఇండ్ల స్థలాలు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ విషయంలో నాన్చివేత ధోరణి విడనాడాలని కోరారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని తమరి నియోజకవర్గానికి విచ్చేస్తున్న దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ప్రాతిపదికన, ఎప్పటి లోగా ఇండ్ల స్థలాలు ఇస్తారో...! నిర్దిష్టమైన తేదీతో సహా వెల్లడించేలా స్పష్టమైన ప్రకటన చేయించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, జిల్లా కమిటీ సభ్యులు రాంపుడి నాగేశ్వరరావు, కొత్త యాకేష్, మంకెన నాగేశ్వరరావు, నూకల రామచంద్రమూర్తి, కొమెర నాగేశ్వరరావు, ఖమ్మం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు తురగ రాఘవేంద్రమూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలుబోల మధుశ్రీ, టీబీజేఏ కెమెరామన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్, గణేష్, అర్షద్, శరత్, నాయకులు సీహెచ్ ప్రసాద్, సురేందర్, గడ్డం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ముధోల్ మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి ప్రణాళికలపై సర్పంచులకు శిక్షణ

ముధోల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
గ్రామాల సమగ్ర అభివృద్ధికి, పారిశుద్ధ్య నిర్వహణకు స్థానిక సర్పంచులు, పంచాయతీ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. శు క్రవారం ముధోల్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై ముధోల్, తానూర్, బాసర మండలాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సర్పంచులకు గ్రామ పరిపాలన అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి, చెత్త నుంచి సేకరించి ఎరువుల తయారీ ద్వారా పంచాయతీలకు ఆదాయం సృష్టించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి,




ముధోల్, తానూర్, బాసర ఎంపీడీఓలు లవన్ కుమార్, దేవేందర్ రెడ్డి, ఎంపీఓలు శివ కుమార్, అమీర్ ఖాన్, గంగా సింగ్ పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లా డీసీసీబీ, డీసిఎంఎస్ పీఠాలను బీసీలకే కేటాయించాలి: చంద్రశేఖర్

## - గత 30 సంవత్సరాలుగా సహకార సంఘాల్లో బీసీలకు తీవ్ర అన్యాయం
## - రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడి విజ్ఞప్తి

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
గత 30 సంవత్సరాలుగా జిల్లాలో డిసిసిబి పీఠం బీసీలకు అందని ద్రాక్షగా మిగిలిపోయిందని, రాజకీయ పార్టీలు సహకార రంగంలో బీసీలకు తీవ్ర అన్యాయం చేశాయని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) చైర్మన్ పదవులలో కూడా బీసీలకు సరైన అవకాశం ఇవ్వకుండా అన్ని రాజకీయ పార్టీలు మోసం చేశాయని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు సంబంధించి నామినేట్ పద్ధతిలో చైర్మన్, పాలకవర్గ సభ్యులను నియమించేందుకు కసరత్తు చేస్తోందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా డీసీసీబీ పీఠంతో పాటు డీసీఎంఎస్



పీఠాన్ని కూడా బీసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లాలో ఉన్న మెజార్టీ పీఏసీఎస్ చైర్మన్ పదవులతో పాటు ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ పదవిని జనాభా ప్రాతిపదికన బీసీలకే కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వానికి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు విజ్ఞప్తి చేశారు.

# భైంసాలో ఘోర ప్రమాదం..

# రెండో అంతస్తు పైనుంచి పడి రెండేళ్ల చిన్నారి మృతి

## - రాహుల్ నగర్ లో ఆడుకుంటూ బాల్కనీ నుండి కిందపడ్డ కీర్తి సింగ్
## - రాజస్థాన్ వలస కుటుంబంలో నిండిన తీవ్ర విషాదం

భైంసా, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో శు క్రవారం అత్యంత దారుణమైన ఊహించని ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు నివాస గృహం రెండో అంతస్తు పైనుంచి కిందపడి రెండు సంవత్సరాల అమాయక ఆడబిడ్డ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మాధవ్ సింగ్, ప్రియాంక దంపతులు బతుకుదెరువు కోసం భైంసా పట్టణానికి వలసవచ్చి ఇక్కడి రాహుల్ నగర్ కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. వీరికి రెండు సంవత్సరాల కుమార్తె కీర్తి సింగ్ ఉంది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో చిన్నారి కీర్తి సింగ్ తమ నివాస గృహంలోని రెండో అంతస్తు బాల్కనీలో ఒంటరిగా ఆడుకుంటోంది.

ఆడుకుంటున్న క్రమంలో ప్రమాదవశాత్తు





కాలు జారి బాల్కనీ రక్షణ గ్రిల్స్ మధ్య నుండి కింద ఉన్న సిమెంట్ రోడ్డుపై పడిపోయింది. చాలా ఎత్తు నుండి కిందపడటంతో చిన్నారి తలకు, శరీర భాగాలకు తీవ్రమైన రక్తస్రావమై, అంతర్గత గాయాలవడంతో ఊపిరి ఆడక అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ప్రమాదాన్ని గమనించిన తల్లిదండ్రులు, కాలనీవాసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నప్పటికీ అప్పటికే చిన్నారి మృతి చెంది ఉండటంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న భైంసా పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పరిశీలించి ప్రాథమిక విచారణ జరిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఈ విషాద ఘటనతో రాహుల్ నగర్ కాలనీలో ఒక్కసారిగా తీవ్ర ఆవేదన, శోకం నిండిపోయాయి.

# జూలై 12న బహుజన కళాకారుల రాష్ట్ర స్థాయి సన్నాహక సమావేశం

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
హైదరాబాద్ లోని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కార్యాలయంలో ఈనెల జూలై 12వ తేదీన నిర్వహించబోయే బహుజన కళాకారుల ప్రత్యేక సన్నాహక సమావేశాన్ని జిల్లా కవి, కళాకారులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్ మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేస్తూ, రాబోయే అక్టోబర్ 9వ తేదీన మాన్యవార్ కాన్షీరాం వర్ధంతి సందర్భంగా నిర్వహించబోయే భారీ బహిరంగ సభ కొరకై కళాకారుల ఐక్యత,



సాంస్కృతిక చైతన్యం, భావి కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చిస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ ప్రత్యేక సాంస్కృతిక సన్నాహక రిహార్సల్స్ లో నిర్మల్ జిల్లాకు చెందిన కళాకారులు పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల కళాకారులు, రచయితలు తమ పేరు, చిరునామా, కళానైపుణ్యం వివరాలను జిల్లా, అసెంబ్లీ కమిటీలకు అందజేసి ఫోన్ నెంబర్ 9440228528 లో సంప్రదించాలన్నారు. సమాజ చైతన్యానికి, బహుజన ఉద్యమ బలోపేతానికి కళాకారులు బాధ్యత వహించాలని కోరారు.

# ఎస్ఐఆర్ ఓటర్ సర్వేను వేగవంతం చేయాలి

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ ఒకటో వార్డులో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని వార్డు కౌన్సిలర్ కత్తి నరేందర్ సూచించారు. శుక్రవారం ఆయన వార్డు పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓ), బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏ) పూర్తి సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. వార్డులో అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ ప్రభుత్వ కార్యక్రమాన్ని మరింత వేగంగా



ముందుకు తీసుకెళ్లేందుకు స్థానిక అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు భాగస్వాములు కావాలన్నారు. కాలనీ వాసుల సహకారంతో ఓటరు జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# ఆర్మూర్ మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

ఆర్మూర్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ శాసనసభ్యుడు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి శుక్రవారం ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌ను (ఆదర్శ పాఠశాల) ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి, అక్కడ విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో, పాఠశాల ఆవరణకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడారు. స్కూల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ వంటి తాము ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, మోడల్ స్కూల్లో నెలకొన్న ప్రతి సమస్యను విద్యాశాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే పూర్తిగా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.



# ఉపాధ్యాయులు ఆధునిక బోధన అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరుచుకోవాలి

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు): మారుతున్న కాలంతో పాటు విద్యా రంగంలో వస్తున్న వినూత్న మార్పులను ఉపాధ్యాయులు గమనిస్తూ, తమ బోధన అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని నిర్మల్ జిల్లా విద్యాధికారి (డీఈఓ) దర్శనం భోజన్న సూచించారు. జిల్లా కేంద్రంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు జరుగుతున్న మూడు రోజుల సమీకృత విద్యా ఉపాధ్యాయుల వృత్యంతర (ఇన్-సర్వీస్) శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న హిందీ విషయ ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకోవాలన్నారు. తరగతి గదులలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. విద్యా రంగ మార్పులను భావితరాలకు అందించే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ వెంకట రమణా రెడ్డి, జిల్లా రిసోర్స్ పర్సన్స్ శశిరాజ్, ధీరజ్, చంద్ర ప్రకాష్, వెంకటేష్ పాల్గొన్నారు.



# నిర్మల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు నెల రోజుల ప్రత్యేక డ్రైవ్:

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టేందుకు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ పరిసరాలు, మయూరి హోటల్ జంక్షన్, మంచిర్యాల చౌరస్తా, ఈద్గా చౌరస్తా ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎస్పీ ఆదేశాల మేరకు నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందంలో టౌన్ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, రూరల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఆర్ఐలు రామ్‌నిరంజన్, రామకృష్ణ, ఎస్ఐలు ఉంటారు. ఈ ప్రత్యేక బృందం నెల రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించనుంది. రోడ్లపై వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం, రహదారుల ఆక్రమణల వల్ల సమస్యలు వస్తున్నాయని, చిరు వ్యాపారులు, ఆటో నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. నిర్మల్ పట్టణానికి ప్రత్యేక ట్రాఫిక్ పోలీసు స్టేషన్ మంజూరైనట్లు, అది పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యే వరకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# కాల్వ తండాలో వనమహోత్సవం..

## పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన ఎంపీఓ

దిలావర్‌పూర్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల పరిధిలోని కాల్వ తండా గ్రామ పంచాయతీలో శుక్రవారం ప్రభుత్వ వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ అధికారి (ఎంపీఓ) స్థానిక సర్పంచ్‌తో కలిసి పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కల్వ తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్), అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీఓ సందర్శించారు. విద్యార్థులకు, చిన్నారులకు వండుతున్న మధ్యాహ్న భోజన వంటశాల పరిసరాలను, ఆహార నాణ్యతను నిశితంగా పరిశీలించి, వంట ఏజెన్సీ నిర్వాహకులకు పారిశుద్ధ్య నియమాలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీఓ న్యూ లోలం గ్రామ పంచాయతీని సందర్శించి, అక్కడ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ఐఆర్ ఓటర్ ఫారాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను, దరఖాస్తుల భర్తీ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. ఆన్‌లైన్ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని



# లోకేశ్వరం, నర్సాపూర్, నిర్మల్ లలో ఎస్ఐఆర్ డిజిటలీకరణను తనిఖీ చేసిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ఫారముల ఆన్‌లైన్ డిజిటలీకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన లోకేశ్వరం, నర్సాపూర్ (జి), నిర్మల్ అర్బన్ మండలాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ముందుగా లోకేశ్వరం మండలం హవర్గా గ్రామంలో, ఆ తర్వాత నర్సాపూర్ (జి) మండలంలో తనిఖీలు చేసి, ఆన్‌లైన్ యాప్ లో వివరాలను చూశారు. మండలాల వారీగా మొత్తం ఓటర్ల సంఖ్య, పంపిణీ చేసిన ఫారములు, తిరిగి తీసుకున్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ లక్ష్యాల ప్రకారం ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనంతరం నిర్మల్ పట్టణంలోని బర్కత్పురా ప్రాంతంలో పర్యటించి, స్థానిక ఓటర్ల ఇళ్లకు వెళ్లి వారు ఎస్ఐఆర్ ఫారములు పూరిస్తున్న తీరును పరిశీలించారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్లు సూర్యారావు, లక్ష్మణ్, రాజు, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, హవర్గా సర్పంచ్ భుజంగరావు, కౌన్సిలర్లు ఇర్ఫాన్, జాకీర్, మొహమ్మద్ రఫీ పాల్గొన్నారు.




# నిర్మల్ అయ్యప్ప ఆలయం వద్ద రెండో రోజు 26 కోతుల పట్టివేత విజయవంతం

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణ ప్రజలకు, భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న కోతుల సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చేపట్టిన ప్రత్యేక కోతుల పట్టివేత కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. పట్టణంలోని ప్రముఖ అయ్యప్ప టెంపుల్ పరిసర ప్రాంతాలలో శుక్రవారం నిర్వహించిన రెండవ రోజు ప్రత్యేక డ్రైవ్ లో మున్సిపల్ సిబ్బంది మొత్తం 26 కోతులను చాకచక్యంగా బోనుల ద్వారా పట్టుకున్నారు. ఈ పట్టివేత కార్యక్రమం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ప్రత్యక్ష ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టుబడిన కోతులను సురక్షితమైన పంజరాల ద్వారా కవ్వాల్ అటవీ ప్రాంతానికి తరలించి అక్కడ విడిచిపెట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలో కోతుల రద్దీ ఎక్కువగా ఉన్న ఇతర కాలనీలలో కూడా ఈ డ్రైవ్ కొనసాగుతుందన్నారు.



# అటవీ, కార్మిక వ్యతిరేక చట్టాలపై ఆగస్టు 10న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలి

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వివిజి రాంజీ చట్టాన్ని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, రైతులకు పార్లమెంట్ లో గిట్టుబాటు ధరల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్త పోరాటాలు చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని గాంధీ పార్క్ లో గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నాయకులు ప్రత్యేక ప్రతిన బూనారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నర్సయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై గ్రామగ్రామాన ప్రజలను ఐక్యం చేసి పోరాడుతామన్నారు. ఇందుకోసం జులై 29వ తేదీన ఢిల్లీలో జాతీయ సదస్సును, అనంతరం జిల్లా కేంద్రంలో సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాకూర్ తిరుపతి, పల్లికొండ గంగామణి, తొడసం శంబు, బరుకుంట గంగారం, తిమ్మాపురం ముత్తన్న, పానగంటి నరేష్ కుమార్, రమేష్ జాదవ్ పాల్గొన్నారు.



# ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెరుగైన విద్య, వసతులు అందించాలి

భైంసా, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రభుత్వ రెసిడెన్షియల్ (గురుకుల) పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన నాణ్యమైన విద్యను అందించడంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలని ముధోల్ శాసనసభ్యుడు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అధికారులను సూచించారు. శుక్రవారం భైంసా పట్టణంలోని తన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని కస్తూరిబా (కేజీబీవీ), సోషల్ వెల్ఫేర్, మైనార్టీ, ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్), గిరిజన ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపాల్ లతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి పాఠశాల ప్రిన్సిపాల్ తో వ్యక్తిగతంగా మాట్లాడుతూ విద్యార్థుల నూతన అడ్మిషన్ల వివరాలతో పాటు పాఠశాలల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు ఎక్కువగా చదువుతారని, వారిని అన్ని రంగాల్లో ఉత్తమంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ, తమ పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే 45 లక్షల రూపాయల నిధులు వెచ్చించి పనులు పూర్తి చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871


# ‘మీ ప్రమాణం’ యాప్‌తో పారదర్శక పాలనకు శ్రీకారం: కలెక్టర్ భవేశ్ మిశ్రా

### – ప్రభుత్వ ఉద్యోగుల హాజరు, పనితీరుపై ఒకే వేదికగా సమగ్ర డ్యాష్‌బోర్డ్
### – ఆగస్టు 15 నాటికి పూర్తిస్థాయిలో అమలుకు కలెక్టర్ ఆదేశాలు

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రభుత్వ శాఖలలో పూర్తిస్థాయి పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ‘మీ ప్రమాణం’ యాప్ తో పాటు ప్రభుత్వ ఉద్యోగుల హాజరు, పనితీరును పర్యవేక్షించే సమగ్ర డ్యాష్‌బోర్డ్ వ్యవస్థను జిల్లాలో అమల్లోకి తీసుకువస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఈఎస్డీ కమిషనర్ రవికిరణ్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ, మీ-సేవ, వైద్యారోగ్య, విద్యా తదితర ప్రజా సంబంధిత శాఖల 70 నుండి 80 శాతం సేవలను ఈ నూతన యాప్‌తో



అనుసంధానం చేసి ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖలు వేర్వేరు మొబైల్ యాప్‌ల ద్వారా ఉద్యోగుల హాజరును నమోదు చేస్తున్నందున, వాటన్నింటినీ ఒకే డ్యాష్‌బోర్డ్‌లో సమీకరించి నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నాటికి ఈ వినూత్న వ్యవస్థను పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకువచ్చి, ఉద్యోగుల పనితీరు పర్యవేక్షణలో నిర్మల్ జిల్లాను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఈడీఎం నదీమ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ‘ఛలో ప్రజా భవన్’ ముట్టడి

### – విద్యార్థి నాయకుల ముందస్తు అరెస్టులను తీవ్రంగా ఖండించిన సిద్ధాల నాగరాజు

ఆర్మూర్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్రంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీఇంబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యుఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ లో చేపట్టిన ‘ఛలో ప్రజా భవన్’ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధాల నాగరాజు మాట్లాడుతూ, ప్రజా భవన్ ముట్టడికి యత్నించిన విద్యార్థి నాయకులను పోలీసులు నిర్బంధించి అక్రమంగా అరెస్టు చేసి నాంపల్లి పోలీసు స్టేషన్ కు తరలించారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాల కాలం పూర్తవుతున్నప్పటికీ,




పేద విద్యార్థుల నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. దీనివల్ల వేలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, డీఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం చేసే పోరాటాలను అణచివేయలేరని, అరెస్ట్ చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలన్నారు.

# ఆర్మూర్ శ్రీ భాషిత పాఠశాలలో వైభవంగా చండీ హోమం

ఆర్మూర్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని ప్రముఖ శ్రీ భాషిత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆయురారోగ్యాలు, సమాజ శ్రేయస్సు కోసం దైవానుగ్రహం కలగాలని ఆకాంక్షిస్తూ పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ ఆధ్వర్యంలో శుక్రవారం చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల శ్లోకాలు, మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ హోమ మహా క్రతువులో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ట్రస్మా ప్రెసిడెంట్ సాధుల మధుసూదన్, జనరల్ సెక్రటరీ ఎన్. రమేష్ రావు, కోశాధికారి పి. రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ, శ్రీ భాషిత పాఠశాలలో ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆనవాయితీగా చండీ హోమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శ్రీ దుర్గా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత విజయాలు సాధించాలని, పాఠశాల మరింత ప్రగతి



పథంలో పయనించాలని పూజలు చేసినట్లు తెలిపారు. హోమ పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు, విద్యార్థులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# గ్రామాల పారిశుద్ధ్య నిర్వహణలో సర్పంచుల పాత్రే కీలకం

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
గ్రామీణ ప్రాంతాల సమగ్ర పారిశుద్ధ్య నిర్వహణలో స్థానిక సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ముధోల్ మండలంలోని తరోడ గ్రామంలో గ్రామపంచాయతీల సమగ్ర ప్రణాళికల రూపకల్పనపై సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల ప్రగతి కోసం సర్పంచులు, అధికారులు పూర్తి సమన్వయంతో పని చేయాలన్నారు. సర్పంచులకు గ్రామ పరిపాలన, నిధుల వినియోగంపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణపై నిరంతర ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని, తడి పొడి చెత్తలను ఇళ్ల వద్దే వేరువేరుగా సేకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.




సేకరించిన చెత్త నుండి సేంద్రియ ఎరువుల తయారీ చేపట్టి పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవచ్చున్నారు. శిక్షణా కార్యక్రమంలో డీఆర్‌డీఓ విజయలక్ష్మి, పంచాయతీరాజ్ అధికారులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం సమీపంలో గల కేంద్ర ఎన్నికల సంఘం ఈవీఎం భద్రతా గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీలలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా గోదాం భద్రతకు సంబంధించిన వివిధ రకాల అధికారిక రిజిస్టర్లను, నివేదికలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాం లోపల, బయట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును, విజువల్స్ ను స్వయంగా తనిఖీ చేశారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే అగ్నిమాపక నియంత్రణ వ్యవస్థ (ఫైర్ సేఫ్టీ) పనితీరును పరీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదాం వద్ద విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణతో కూడిన పటిష్టమైన భద్రతను నిర్వహించాలని ఆదేశించారు. అగ్నిమాపక పరికరాలను ఎల్లప్పుడూ



అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి శివాజీ, తహసిల్దార్ రాజు, అధికారులు స్వాతి పాల్గొన్నారు.

# నిరుపేద వివాహానికి, విగ్రహ ప్రతిష్టాపనకు గల్ఫ్ గంగపుత్ర సంఘం ఆర్థిక సాయం

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సామాజిక సేవా బాధ్యతలో భాగంగా గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం సహాయ నిధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జగిత్యాల జిల్లా పరిధిలో రెండు ప్రధాన ఆర్థిక సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఫౌండేషన్ వివరాల ప్రకారం, జగిత్యాల జిల్లా సారంగాపురం మండలం రేచపల్లి గ్రామానికి చెందిన ఒక నిరుపేద గంగపుత్ర కుటుంబానికి చెందిన యువతి వివాహ నిమిత్తం మ్యారేజ్ హెల్ప్ ఫండ్ కింద 20,000 రూపాయల నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ నిధి కొరకై 5,116 రూపాయల ఆర్థిక విరాళాన్ని సంఘం ప్రతినిధులు భక్తిపూర్వకంగా అందజేశారు. ఈ సేవా కార్యక్రమాలలో సంఘం సహాయ నిధి ఫౌండేషన్ అధ్యక్షుడు తోకల శంకర్, తోకల లచ్చయ్య, తోకల నరసయ్య, జింబార్తి రాజ నరసయ్య, రేచపల్లి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు జుంబర్తి నరసయ్య, ఉపాధ్యక్షుడు బింగి రాజాం, ప్రధాన కార్యదర్శి పాకాల గంగాధర్, దొంతాపూర్ సంఘం అధ్యక్షుడు పందిరి సుధాకర్, కొంద్ర రాజన్న, మాటూరి నర్సయ్య పాల్గొన్నారు.





# నిర్మల్ జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

### – విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ మొండివైఖరి నశించాలి
### – పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్రంలోని విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తుతూ వామపక్ష విద్యార్థి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ నిర్మల్ జిల్లాలో అత్యంత విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఈ బంద్‌కు మద్దతు తెలిపి స్వచ్ఛందంగా మూసివేశారు. విద్యా రక్షణకై విద్యార్థులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి రోడ్లపై నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కైలాస్, పీడీఎస్యు అధ్యక్షుడు సింగరి వెంకటేష్ మాట్లాడుతూ, కార్పొరేట్ శక్తులకు ఊతమిస్తూ ప్రభుత్వ విద్యా రంగాన్ని పడకేయించేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు.
ప్రధాన డిమాండ్లు ఇవే:
గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్




బకాయిలను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యంగా సాగుతున్న ఫీజుల దోపిడీకి తక్షణమే అడ్డుకట్ట వేయాలి. ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని (ఆర్టీఈ) రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయాలి. నిర్మల్ జిల్లా పీజీ కళాశాలలో వెంటనే రెగ్యులర్ తరగతులను ప్రారంభించాలి. జిల్లాలో నవోదయ పాఠశాలల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చొరవ చూపాలి. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, బెంచీల కొరతను తీర్చాలి. జిల్లాలో దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న ఎంఈఓ, డీఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. అద్దె భవనాల్లో ఉన్న గురుకుల పాఠశాలలు, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకానికి బకాయి ఉన్న 250 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలి. హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ ఛార్జీలను చెల్లించాలి. డిమాండ్లు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో ప్రగతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నితిన్, కృష్ణా నితిన్, శ్రీహరి, కార్తీక్, కిరణ్ పాల్గొన్నారు.

# బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించిన భైంసా సబ్ కలెక్టర్

బాసర, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థాన పునర్నిర్మాణ పనులను భైంసా సబ్ కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించి నిశితంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్తర ద్వార గోపురం కూల్చివేత, నూతన కృష్ణశిలా నిర్మాణాలకు సంబంధించిన పురోగతి వివరాలను దేవస్థాన సహాయ కార్యనిర్వహణాధికారి (ఏఈఓ) గంగా శ్రీనివాస్ ను అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పనుల లేఅవుట్ ను పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఆలయ పునర్నిర్మాణ పనులను ముందస్తుగా నిర్ణయించిన గడువులోగా నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్ర పునర్నిర్మాణ పనులు జరుగుతున్న తరుణంలో బాసర క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నూతన బాలాలయంలో అన్ని రకాల వసతులు, తాగునీరు, క్యూలైన్లు పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ అధికారిక పరిశీలన కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ పవన్ చంద్ర, ఆలయ సూపరింటెండెంట్లు, సిబ్బంది, దాతల ప్రతినిధులు పాల్గొన్నారు.



OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com